www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 21 నవంబర్ 2022
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

హక్కుల సాధనకు

శ్రామిక మహిళలు ఉద్యమించాలి

శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి పిలుపు

ప్రజాశక్తి-నెల్లూరు

గౌరవవేతనం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల శ్రామిక మహిళలు శ్రమ దోపిడికీ గురవుతున్నారని శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి విమర్శించారు. ఈ నేపథ్యంలో శ్రామిక మహిళలు హక్కుల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో జరిగిన శ్రామిక మహిళా జిల్లా 3వ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సుకు మహిళా నాయకులు ఎస్‌కె రెహెనాబేగం, కె.విజయలక్ష్మి, టి.శివకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పనిచేస్తున్నారని వారికి కనీసవేతన చట్టం అమలు కావడం లేదన్నారు. స్త్రీ, పురుషులు కలిసి పనిచేసే పలు రంగాల్లో మహిళలపై లైంగిక వేధింపులు అధికంగా ఉంటున్నాయన్నారు. సేవా రంగాలైన ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్నభోజన పథకం వంటి రంగాల్లో రాజకీయ వేధింపులు, బెదిరింపులకు తోడు అధికారుల వేధింపులు నిరంతరంగా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌టిసి, భవన, మున్సిపల్ , బీడి రంగాలు, స్కూల్ స్వీపర్లు, విఓఎలు, రిసోర్స్ పర్సన్స్ వంటి వారు అతి తక్కువ వేతనాలతో దుర్భరమైన జీవితం సాగిస్తున్నారన్నారు. ఉన్నత న్యాయస్థానం తీర్పును అనుసరించి సేవా రంగంలో పనిచేస్తున్న మహిళలందరికీ కనీస వేతనంగా రూ. 26 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చే విధంగా కేవలం 4 కోడ్స్‌గా మార్చి కార్మిక చట్టాలను మార్పు చేయడం దారుణమన్నారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో తమ కుటుంబాలను పట్టించుకోకుండా, ప్రజల ఆరోగ్య సంరక్షణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్నభోజన కార్మికులు ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా పనిచేశారన్నారు. ఆ సమయంలో ఎంతో మంది మహిళలు తమ ప్రాణాలను కోల్పో యారన్నారు. కుటుంబాలను ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. హక్కులు సాధనకు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి రంగం నుంచి రాజకుమారి, భారతి, విఓఎ రంగం నుంచి కౌసల్య, భవన నిర్మాణ సంఘం నుంచి సంపూర్ణ, ఆశా రంగం నుంచి పి.భాగ్యరేఖ, ఎస్.మధుసూదన, కె.లక్ష్మి, అంగన్‌వాడీ రంగం నుంచి ఎల్.వి.శేషమ్మ, సుజాత, మధ్యాహ్నభోజన పథకం రంగం నుంచి శీనమ్మ, మున్సిపల్ రంగం నుంచి సుజాత, కోటేశ్వరి పాల్గొని మాట్లాడారు.

మాట్లాడుతున్న కె ధనలక్ష్మి

మహాసభకు హాజరైన ప్రతినిధులు

'ఒవెల్ -14 యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నేడు తహశీల్దార్ కార్యాలయాలు వద్ద ధర్నాలు -ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాలు వెల్లడి

ప్రజాశక్తి-నెల్లూరు :స్థానిక పొదలకూరు రోడ్డు సమీపంలోని ఓవెల్ -14 స్కూల్లో చోటు చేసుకున్న ఘటనను నిరసిస్తూ నేడు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, కెవిపిఎస్, ఆవాజ్ జిల్లా కమిటీలు పేర్కొన్నాయి. ఆదివారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో ఈ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఓవెన్ స్కూల్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో 974 మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యాశాఖ తీసుకున్న నిర్ణయాని ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ ఘటనకు కారణమైన యాజమాన్యం డైరెక్టర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ పాఠశాలకు ప్రభుత్వం గుర్తింపు రద్దు చేసిందని ప్రకటన ఇచ్చిన అధికారులు 24 గంటలు పూర్తి కాకముందే స్కూల్ కొనసాగించుకోవచ్చని తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వడం దారుణమన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు ఆ స్కూలు పైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ నరసింహ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి శివకుమారి పద్మ ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ ఎస్ఎఫ్ఐ నాయకులు నరేంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

డివైఎఫ్ఐ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలోని 6వ డివిజన్ శెట్టిగుంట రోడ్డు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆ సంఘం 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం జెండా ఆవిష్కరణ జరిగింది. డివైఎఫ్ఐ డివిజన్ నాయకులు రవి ఆవిష్కరించారు. డివైఎఫ్ఐ నగర కార్యదర్శి బి.నరసింహ,డివిజన్ శాఖ కార్యదర్శి చెంగయ్య నాయకులు ఏ.నాగయ్య,రాంబాబు,ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి -పొదలకూరు

పొదలకూరు పంచాయతీ పరిధిలో ఆరు రోజుల్లో రూ. 9.20 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరిపినట్లు మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు పంచాయతీ పరిధిలోని లింగంపల్లి తోపులో ఆదివారం ఆయన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా విచ్చేసిన ఆయన నూతనంగా నిర్మించిన సచివాలయం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతు న్నాయి కాబట్టే నిన్నటి వరకు నానా యాగీ చేసిన జనసేన టిడిపి లు ప్లేట్ ఫిరాయించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ తామూ అందిస్తామని, కొనసాగిస్తామని ప్రకటించాయని పేర్కొన్నారు. జెడ్‌పిటిసి తెనాలి నిర్మలమ్మ, మండల ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి, వైసిపి నాయకులు గోగిరెడ్డి గోపాల్ రెడ్డి, చిన్న బ్రహ్మయ్య, పెద్దమల్లు రమణారెడ్డి, బచ్చల సురేష్ కుమార్ రెడ్డి, సోమ భాస్కర్, శివ కుమార్, ఆర్, జయమూర్తి రెడ్డి, అల్లు ప్రభాకర్ రెడ్డి, ఎం శేఖర్, మాలి సతీష్ కుమార్ రెడ్డి, ఎంపిటిసి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల్లో..

ఉద్యమ అభ్యర్థులను గెలిపించాలి

తూర్పు రాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల ఉమ్మడి అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి -కందుకూరు

తూర్పు రాయలసీమ శాసనమండలి ఉమ్మడి అభ్యర్థుల పరిచయ కార్యక్రమం ఆదివారం కందుకూరు దాచూరి రామిరెడ్డి విజ్ఞాన భవన్లో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కిలారి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. యుటిఎఫ్ ,ఎస్‌టియు, పెన్షనర్స్ ,సిఐటియు, ఏపీఎంఎస్‌పిఎఫ్, వ్యవసాయ కార్మిక సంఘం తదితర సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. శాసనమండలి తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఉమ్మడి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లడానికి ఉద్యమ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. శాసనమండలలో పిడిఎఫ్, స్వతంత్ర ఎమ్మెల్సీలు అనేక ప్రజా సమస్యలపై నికరంగా వారి గళాన్ని వినిపిస్తున్నారన్నారు. ఎలాగైనా వారిని సభకు రాకుండా అడ్డుకోవాలని పాలకవర్గాలు భావించటం హేయమన్నారు. రాష్ట్రంలో ఐదు శాసనమండలి నియోజకవర్గాలకు మార్చిలో ఎన్నికలు జరగబోతున్నాయని, వాటిలో ఉద్యమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఓటర్ల నమోదు లో అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. అనేకమంది అనర్హులను ఓటర్లుగా చేర్పించారని వారందరిని అనర్హులుగా ప్రకటించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. అధికారులపై పాలక పార్టీ పెద్ద ఎత్తున ఒత్తిడి తీసుకువచ్చి బొగస ఓట్లు నమోదు చేశారని విమర్శించారు. ప్రజా సమస్యలపై నికరంగా పోరాడే ఉద్యమ అభ్యర్థులను శాసన మండల ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. యుటిఎఫ్ నెల్లూరు జిల్లా శాఖ అధ్యక్షులు చలపతిశర్మ, ఎస్‌టియు ప్రకాశం జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాసులు, ఏపీ ఎం ఎస్ టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ బాసు బాబు, జనవిజ్ఞాన వేదిక నాయకులు మహబూబ్ బాషా, సిఐటియు నాయకులు జివిబి కుమార్ ,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి వెంకటేశ్వర్లు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఎంఎస్ రాంబాబు, ప్రధానోపాధ్యాయుల తరుపున బండి సుబ్బారావు ,యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిలు జి సతీష్ ,గొర్రెపాటి మధుసూదన్ రావు, ఎం లేని నా, ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ అశోక్ ,యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎం కోటేశ్వరరావు, సిహెచ్ ఉమామహేశ్వరరావు ,పొన్నగంటి వెంకటేశ్వర్లు ,ఎం మాధవరావు ,పి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మీగడ వెంకటేశ్వరరెడ్డి

ఆర్‌టిసి డిఎంకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి -కందుకూరు : ఇటీవల కాలంలో పోన్నలూరు మండలం ముండ్లమూరి వారిపాలెంలో ఆర్‌టిసి బస్సుని నడపాలని కోరుతూ విద్యార్థుల కోసం చెరుకూరు, ముండ్లమూరివారిపాలెం, సుంకిరెడ్డిపాలెం, పెరిగిపాలెం గ్రామస్తులు చేశారు. గత నాలుగు రోజుల నుంచి విద్యార్థులకు ఎటువంటి ఆటంకం కలగకుండా బస్సు సరైన సమయానికి వస్తోంది. సమస్యను అర్థం చేసుకుని కందుకూరు ఆర్‌టిసి డిపో మేనేజర్ సరైన సమయానికి బస్సును పంపించారు. విద్యార్థులు, వారి తల్లి దండ్రులు, గ్రామస్తుల తరపున డిపో మేనేజర్‌కి ధన్యవాదాలు తెలిపారు.

టిడిపి పాలనలో మహిళలకు పెద్దపీట : ఇంటూరి

ప్రజాశక్తి -కందుకూరు : పట్టణంలోని 17వ వార్డు బంగారమ్మగుడి వద్ద టిడిపి నియోజవర్గ మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మాటామంతి కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు దివి సౌభాగ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు , పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు దివి శివరాం హాజరయ్యారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి హయాంలో డ్వాక్రా గ్రూపులకు పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేయడంతో పాటు, మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడేలా స్వయంశక్తి పథకాలు అమలు చేశారన్నారు. దివి శివరాం మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు వల్లనే తెలుగు మహిళలకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు దివి శ్రీనివాసరావు, పట్టణ మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ, దివి రాధ, పులివర్తి కవిత, దివి లక్ష్మీ, బత్తిన నాగేంద్ర, అనుమోలు ఆదిలక్ష్మి, స్వర్ణ రమణమ్మ, కాకుమాని విజయ, నాయకులు ఉన్నం కష్ణ, దివి వెంకటేశ్వర్లు, దివి కొండయ్య, బెల్లం వెంకటేశ్వర్లు, గళ్ళా రమణయ్య, నెల్లూరు సింగయ్య, నెల్లూరు నాగేశ్వరరావు,కె మాల్యాద్రి పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరులోని పామూరు రోడ్డులో శ్రీ లక్ష్మీతిరుమల కళ్యాణ మండపంలో విలేకరి షేక్ బాజీ సోదరుడు షేక్ మస్తాన్ బాజీ, శిరీష నిఖాఖా ఆదివారం జరిగింది. కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వర రావు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు దివి శివరాం దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కందు కూరులోని పోతురాజుమిట్ట వద్ద గల షాదీఖానాలో, టీడీపీ సీనియర్ నాయకులు సయ్యద్ బాబు మనవరాలు సయ్యద్ ఫిర్ జోస్, అబ్దుల్ హాఫీజ్ నిఖాఖా కి హాజరై కొత్త దంపతులను ఇంటూరి నాగేశ్వరరావు ఆశీర్వదించారు. పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సలాం, నియోజకవర్గ ముస్లిం మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ ఫిరోజ్, కందుకూరు నియోజకవర్గ ఐటీడీపీ కోఆర్డినేటర్ షేక్ మున్నా, నియోజవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు షేక్ మాబాషా, నాయకులు షేక్ రూబీ, తోకల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముగిసిన 'రోబో' శిక్షణ

ప్రజాశక్తి -కందుకూరు : ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కోడింగ్ రాయడంలో నైపుణ్యతను ప్రదర్శిస్తున్నారని విశిష్ట ఇన్నోవేషన్ సిఇఓ సాయి సందీప్ అభినందించారు. రోబోట్ వర్క్ షాప్ ముగింపు సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ కోడింగ్ విద్యార్థుల నైపుణ్యం వల్ల మూడు రోజుల వర్క్ షాప్‌ను రెండు రోజుల్లో పూర్తి చేయగలిగామన్నారు. మూడో సంవత్సరం ఇసిఇ విద్యార్థులు ఏడు బందాలుగా ఏర్పడి ఒక్కో రోబోను రూపొందించారని అసిస్టెంట్ ప్రొఫెసర్ మస్తాన్ వలీ వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ తమ కళాశాలలో తీరి క్లాసులు కన్నా ప్రాక్టికల్ బోధనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రెండు రోజుల్లో రోబోల నిర్వహణలో తమ విద్యార్థులను ఉన్నతంగా తీర్చి దిద్దిన విశిష్ట ఇన్నోవేషన్స్ శిక్షకులకు కతజ్ఞతలు తెలిపారు. జనరల్ మిలటరీ అప్లికేషన్, వన్యమృగాల ఫోటోగ్రఫీల రోబోలకు పారిశ్రామిక రూపకల్పన అనుమతి దరఖాస్తు చేయాలని ఇసిఇ విభాగానికి రామయ్య సూచించారు. మొబైల్ కంట్రోల్ కారు రోబోను ప్రకాశం క్యాంపస్ లో వినియోగించేందుకు లెక్చరర్లు ప్రణాళిక రూపొందించాలని కోరారు. అవసరమైన వ్యయాన్ని యాజమాన్యం భరిస్తుందని టెక్నికల్ డైరెక్టరు డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ న్యూరల్ నెట్వర్క్ సాంకేతికతో మొబైల్ వాయిస్ తో పని చేసే రోబోట్ ఆకర్షణీయంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.రవికుమార్, సహాయ అధ్యాపకులు డాక్టర్ రాకేష్, మస్తాన్ వలీ, శిక్షకులు వై.ఈశ్వర్ వెంకట్ ఆకాష్, ఎం.నితీష్ లు రోబో ప్రదర్శన శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శిబిరంలో మాట్లాడుతున్న కంచర్ల రామయ్య

'నేడు డయల్ యువర్ కమిషనర్'

ప్రజాశక్తి -కందుకూరు :స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం ఉదయం 10:30 నుండి స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ ఎస్ మనోహర్ తెలిపారు. ఉదయం 10:30 నుంచి 12 గంటల వరకు 9177700267 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలపవచ్చున్నారు.

వైద్య రంగంలో నిరంతర అధ్యయనం అవసరం

'అపోలో' ఆధ్వర్యంలో న్యూరో ఎసెన్షియల్స్ సిఎమ్ఇ - వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన వైద్య నిపుణులు

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని ఓ ప్రముఖ హోటల్లో నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్ న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో న్యూరో ఎసెన్షియల్స్ సిఎమ్ఇ (సిఎంఈ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ ఈ కార్యక్రమానికి డాక్టర్ జి.అశోక్ ,అపోలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ ముఖ్య అతిథులుగా హాజరు కాగా డాక్టర్ అచల్ గులాటి గెస్ట్ ఆఫ్ హానరుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అపోలో ఆసుపత్రి న్యూరాలజీ విభాగాధిపతి, కార్యక్రమ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ వైద్య విద్య నిరంతరం అభ్యసించాల్సిన ప్రక్రియని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిలర్ నుంచి ఈ సిఎమ్ఈ కార్యక్రమానికి టూ క్రెడిట్ హవర్స్ ఇచ్చారన్నారు. వైద్యరంగంలో నవీకరించబ డుతున్న విషయాల గురించి వైద్యులు నిరంతరం తెలుసుకుంటూ ఉండాలన్నారు. ప్రధానంగా వ్యాధి యొక్క క్లినికల్ లక్షణాలు, సంకేతాలపై దష్టి సారించాల్సిన అవసర ముందన్నారు. వక్తలుగా ఢిల్లీ, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి పలువురు వైద్యనిపుణులు హాజరయ్యారు. అపోలో ఆసుపత్రి న్యూరో డాక్టర్ హరిత కుమారి , ఆసుపత్రి వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యులు

హాస్టళ్లలో పరిశీలన

తోటపల్లిగూడూరు :హ్యూమన్ రైట్స్ కంజర్వేషన్ కమిటీ ఆఫ్ ఇండియా (హెచ్ ఆర్ సిసిఐ) ప్రతినిధులు ఆదివారం ప్రభుత్వ సంక్షేమ వసతి గహల్లో మౌలిక వసతులను పరిశీలించారు. హ్యూమన్ రైట్స్ రీజనల్ చైర్మన్ సి హెచ్ లక్ష్మణ్ సింగ్ ఆదేశాల మేరకు మండల చైర్మన్ ఎంబేటీ వెంకటేశ్వర్లు, సెక్రెటరీ ఈగ ఆదిశేషయ్య బీసీ, ఎస్సీ వసతి గహాలను పరిశీలించారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతులు పరిశీలించారు.

బాలల కమిటీ ఏర్పాటు

నెల్లూరు జాకిర్ హుస్సేన్ నగర్‌ప్రాంతంలో సింహపురి చిల్డ్రన్స్ అసోసి యేషన్ బాలల కమిటీ ఏర్పాటైంది. ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఈ నూతన కమిటీని డివైఎఫ్ఐ నాయకులు ఏర్పాటు చేశారు. డివైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ ఆవాజ్ నగర కార్యదర్శి షేక్ రియాజ్ డివైఎఫ్ఐ నగర కమిటీ సభ్యులు సాధిక్ పాల్గొన్నారు

ఘనంగా కార్తీక వనభోజనాలు

పొదలకూరు :కార్తీకమాసం నేపథ్యంలో పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ లోని శ్రీలక్ష్మీ గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థాన ఆవరణంలో ఆదివారం కార్తిక వన భోజనాలు నిర్వహించారు.ఇటువంటి కార్యక్రమాల వల్ల ప్రజల్లో ఐక్యత పెంపొందుతుందని పలువురు వ్యాఖ్యానించారు.

ఇల్లు కూల్చారని..

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-గుడ్లూరు : ఇల్లు కూల్చారని మనస్థాపంతో మహిళ ఆత్మహత్యకు విఫలయత్నం చేసిన సంఘటన ఆదివారం గుడ్లూరులో సంచలనం కలిగించింది. వివరాల మేరకు గుడ్లూరు సినిమా థియేటర్‌కు సమీపంలో రైస్ మిల్లు దగ్గర ఎస్‌కె కరిమ అనే మహిళ తన తండ్రి ద్వారా సంక్రమించిన స్థలంలో గుడిసె నిర్మించుకుని నివాసం ఉంటుంది. కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. కరీమా గహానికి ప్రభుత్వం పట్టా మంజూరు చేసింది. గహ నిర్మాణ శాఖ నుంచి ఇల్లు మంజూరైంది. పునాది నిర్మించుకుంది. ఇంటి పక్కనే ఉన్న 179 సర్వే నెంబర్‌లోని ఇంటి యజమానులు తమ ఇంటికి దారి కల్పించాలని అధికా రులకు విజ్ఞప్తి చేశారు. న్యాయ స్థానం నుంచి కూడా ఆర్డర్ తెప్పించుకున్నారు. రెవెన్యూ అధికారులు సామరస్య పూర్వకంగా దారి కల్పించాల్సింది పోయి కరిమా ఇంటిని కూల్చివేశారు. దీంతో ఆ మహిళ తనకు న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నా అధికారులు కనికరం చూపలేదు. జెసిబి ద్వారా పునాదిని సైతం తొలగించారు. తీవ్ర మనోవేదనకు గురైన కరీమా పురుగుమందు తాగింది. ప్రమాదాన్ని పసిగట్టిన ఆమె కుమారుడు వెంటనే కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందు తోంది. దీనిపై తహశీల్దార్‌ను ప్రశ్నించగా జగనన్న కాలనీలో ఆమెకు ఇంటి స్థలం కేటాయించినట్లు తెలిపారు. న్యాయ పోరాటం చేస్తామని సిపిఎం నేతలుతెలిపారు.

ఇల్లు కూల్చుతున్న దృశ్యం

కుమ్మరిపాలెంలో

ప్రారంభానికి నోచని 'నాడు-నేడు' పనులు

మెడికల్ సెలవుపై వెళ్లిన హెచ్‌ఎం - 'ఎంఎల్‌ఎ' వద్దకు చేరిన పంచాయితీ

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : ప్రభుత్వం 'నాడు-నేడు' పథకం కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తోంది. ఈ క్రమంలోనే వలేటివారిపాలెం మండలం, పోకూరు పంచాయతీ పరిధిలోని కుమ్మరిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను నాడు-నేడు పథకం రెండోదశలో ఎంపిక చేశారు. అవసరమైన నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. సదరు పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న నెపంతో అభివృద్ధి అవసరం లేదని ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిసింది. దాంతో నిధులు విడుదల నిలిచిపోయింది. ఈ విషయమై గ్రామస్తులు, ఆ ప్రధానోపాధ్యాయుడి మధ్య వివాదం జరిగినట్లు తెలిసింది. అనంతరం ప్రధానోపాధ్యాయులు మెడికల్ లీవుపై వెళ్లారు. సెప్టెంబరు నెల నుంచి సెలవులోనే ఉన్నారు. తిరిగి విధుల్లో చేరలేదు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. 25 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం పాఠశాలకు రూ. 36 లక్షలు నిధులు విడుదలైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆ నిధులతో పాఠశాలలో పనులు ప్రారంభించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి పెంచుతున్నారు. పాఠశాల ప్రస్తుతం ఉన్న ప్రాంతం నుంచి గ్రామంలోనే తాగునీటి ట్యాంకు వద్దకు మార్చాలని తలిచారు. అక్కడ గ్రామకంఠం భూమి సుమారు 50 సెంట్లు ఉంది. పాఠశాలను అక్కడకు మార్చడం ద్వారా గ్రామస్తులందరికీ అనుకూలంగా ఉంటుందని స్థానికులు భావించారు. ఇదే విషయాన్ని అధికారులకు వివరించారు. వారు స్థల పరిశీలన చేశారు. నూతనంగా పాఠశాల నిర్మించేందుకు అనుకూలంగా ఉండటంతో విద్యాశాఖ ఉన్నతాధి కారులు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిసింది. పనులు ప్రారంభం కాని విషయం, ప్రధానోపాధ్యాయుడి నిర్వాకంపై ఎంఎల్‌ఎ ఎం మహీధర్‌రెడ్డి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. విద్యాశాఖ అధికారులు సదరు విషయాన్ని ఎంఎల్‌ఎకు వివరించినట్లు తెలిసింది. గురువారం ఎంఇఒ రవి కుమ్మరిపాలెం పాఠశాల వద్దకు వెళ్లారు. అక్కడి పరిస్థితులు అధ్యయనం చేశారు. పనులు ప్రారంభించేందుకు పాఠ శాలలో పని చేస్తున్న మరో ఉపాధ్యాయుడికి ఆ బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిసింది. నూతనంగా ఎంపిక చేసిన ప్రదేశంలో పాఠశాల, అవసరమైన వసతులు, కల్పించనున్నారు. దీనిపై ఎంఇఒ రవిని ప్రజాశక్తి సంప్రదించింది. ప్రధానోపా ధ్యాయుడు పనులు తాను చేయలేనని తమకు రాసిచ్చినట్లు చెప్పారు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో సెలవులో ఉన్నారని, అప్పటి నిబంధనల మేరకు నాడు-నేడులో తరగతి గదులు అవసరం లేదని నివేదిక ఇచ్చిన మాట వాస్తవమేనన్నారు. సహ ఉపాధ్యాయుడితో పనులు చేయించేందుకు సిద్ధమయ్యామన్నారు. ఆ మేరకు బ్యాంకు ఖాతాలో మార్పులు చేస్తున్నట్లు వివరించారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

కుమ్మరిపాలెంలోని ప్రాథమిక పాఠశాల

నేడు 'కండలేరు'లో జల దీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలోని కండలేరు, కనిగిరి రిజర్వాయర్ సహా 15 చెరువుల్లోని మత్స్య సంపదను వేలం వేసేందుకు విడుదల చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ నేడు యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కండలేరు జలాశయంలో మత్స్యకారులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి జలదీక్ష నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసి పెంచలయ్య తెలిపారు. ఆదివారం నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసి పెంచలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాపూరు కష్ణయ్య, జిల్లా చైర్మన్ చేవూరు సుబ్బారావు, మహిళా కన్వీనర్ చెంబేటి సుమతి, చెంబేటి ఉష, పాముల కోటేశ్వరమ్మ, ఇండ్ల రమ్య, పుత్తూరు శ్రీనివాసరావు, కల్లూరు శేషగిరి, ఆల్ ఇండియా యునైటెడ్ ఫోరం, ఎస్‌టి,ఎస్‌సి,బిసి, మైనారిటీ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు మాకాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెసి పెంచలయ్య

'నేడు స్పందన'

నెల్లూరు : ప్రజా సమస్యల పరిష్కార వేదికగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కమిషనర్ హరిత ఆకాంక్షించారు. నేడు కార్యాలయంలో జరిగే స్పందన వేదికలో సమస్యల పరిష్కారం కోసం 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమంలో భాగంగా ఉదయం 9:30 నుంచి 10:30 వరకు 0861-2355678 నెంబరుకు సంప్రదించవచ్చన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ఉలవపాడు : ఉలవపాడులో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు వేడుకలు జరిగాయి. ఈ నెల14 నుంచి 20 వరకు జరిగిన వివిధ రకాల పోటీలలో శాంతి నికేతన్ ఇంగ్లీష్ మీడియం, సెయింట్ జోసెఫ్, శ్రీసాయి ఒలంపియాడ్, గౌర్నమెంట్ హైస్కూల్, సెయింట్ పీటర్స్, లిటిల్ ఎంజెల్స్ మొదలగు పాఠశాలలకు చెందిన విద్యార్థులు రోజుకు 250 మంది చొప్పున పోటీలో పాల్గొన్నారు. ఇందులో గెలు పొందిన విజేతలకు మొత్తం 105 బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా ఉలవపాడు ఎస్ఐ టి త్యాగరాజు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథ పాలకుడు డి కోటేశ్వరరావు మాట్లాడారు.

వైసిపి పాలనలో బాదుడే.. బాదుడు : టిడిపి

ప్రజాశక్తి -కందుకూరు :రాష్ట్రం అన్ని విధాలుగా సర్వనాశనం అయిపోయిందని, అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డే కారణమని కందుకూరు నియోజవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. బాదుడే బాదుడు కార్యక్ర మంలో భాగంగా పట్టణంలోని 5వ వార్డు పాలిటెక్నిక్ కాలేజీ, బందావనం ప్రాంతాల్లో ఆయన ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ 5వ వార్డు ప్రాంతం అభివద్ధిలో పూర్తిగా వెనుకబడిం దన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, వార్డు అధ్యక్షుడు నూకతోటి కోటేశ్వరరావు, వార్డు నాయకులు అభిషేక్ పాల్, నూకతోటి అరుణ్, నూకతోటి వరలక్ష్మి, నూతలపాటి భవాని, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నరేంద్ర, నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి పాల్గొన్నారు.



కరపత్రం అందజేస్తున్న ఇంటూరి

ఎంఎల్‌ఎ 'మానుగుంట'ను కలిసిన 'పేర్నాటి'

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరు నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డిని తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఆదివారం కలిసి కతజ్ఞతలు తెలిపారు. కందుకూరు నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం గురించి, నియోజకవర్గంలో పట్టబధ్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారాన్ని ఏ విధంగా నిర్వహిం చాలి అనే అంశంపై ఎంఎల్‌ఎతో ఎంఎల్‌సి అభ్యర్థి చర్చించారు.

ఘనంగా కాటంరెడ్డి వర్ధంతి



ప్రజాశక్తి-అల్లూరు

అల్లూరు మాజీ ఎంఎల్ఎ కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి స్వగృహం వద్ద ఆదివారం ఆయన తండ్రి కాటంరెడ్డి ఆదినారాయణ రెడ్డి 41వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా మండలంలోని ఆది నారాయణ పురం గ్రామంలో ఉన్న ఆయన విగ్రహానికి గ్రామస్తులతో కలిసి పూలమాలలు వేశారు. అనంతరం చిత్రపటం వద్ద సన్నిహితులు, అభిమానులు, పలువురు నేతలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దొడ్ల వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ దళిత వాడలు, తీర ప్రాంత గ్రామాలలో కలరా, మసూచి అనే మహమ్మారి బారిన పడి ఎంతోమంది మరణించారని తెలిపారు. సొంత రక్తసంబంధీకులే అంత్యక్రియలు చేయాలన్నా భయపడే వారిని వివరించారు. అప్పట్లో ఆయన యువకుడిగా ఉన్న క్రమంలో ఉచితంగా మందులు తీసుకువచ్చి పంపిణీ చేయడమే కాకుండా చనిపోయిన ఇంట్లోకి నేరుగా వెళ్లి పాడె మోసేవారని ఆయన చూసి ఇతరులు వచ్చేవారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి మన మధ్య లేకపోవడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. దాదాపు 65 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారని ఆయనను కొనియాడారు. మాజీ ఎంఎల్ఎ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నిరంతరం ఆయన పేద ప్రజల కోసం తపిస్తూ ఎన్నో సేవలు చేశారని తెలియజేశారు. త్వరలో తన తండ్రి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని అభిమానులకు హామీనిచ్చారు. ఉచితంగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని అనుకోగా కొన్ని అనివార్య కారణాలవల్ల 2వారాల వ్యవధిలో ఏర్పాటు చేస్తానని వ్యాఖ్యానించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆయన సతీమణి శివప్రియ తదితరులు ఉన్నారు.

జనసేన ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అల్లూరు : స్థానిక అల్లూరుపేటలో ఆదివారం జనసేన ఆధ్వర్యంలో టీం పిడికిలి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు కారుమంచి కార్తీక్ శర్మ మాట్లాడుతూ జనసైనికులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అంధకారంలో ఉన్న జనాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు తమ అధినేత పవన్‌కళ్యాణ్ పాటుపడుతున్నారని తెలియజేశారు. రాబోవు రోజులలో జనసేన అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో నాని, రమణ, సుబ్రహ్మణ్యం, రవి, కేశవచార్యులు, మహమ్మద్ అలీ, తదితరులు ఉన్నారు.

మేకపాటికి పేర్నాటి అభినందనలు

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైసిపి అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఆదివారం వైసిపి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గం పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు ప్రచారాన్ని ఏవిధంగా నిర్వహించాలని అంశంపై ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి నియోజకవర్గ ప్రచార కార్యదర్శి శాంతి కుమారితో సుదీర్ఘంగా చర్చించారు. ముందుగా ఎనిమిది మండలాల వైసిపి నాయకుల సమన్వయంతో గతంలో కంటే ఇప్పుడు రెట్టింపుగా ఓట్లు నమోదు చేయించడంలో చొరవ తీసుకున్నందుకు ఎంఎల్ఎ మేకపాటికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు అక్కి భాస్కర్ రెడ్డి, చింతంరెడ్డి సుబ్బారెడ్డి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, నాయకులు యర్ర చిన్న బ్రహ్మయ్య పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్ : ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2021-22 కింద ఎంపికైన లబ్ధిదారుల గృహ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం పిఎంఏవై- వైఎస్ఆర్ గ్రామీణ లబ్ధిదారుల అవగాహన సదస్సు, గ్రౌండింగ్ చెర్లో యడవల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో 148 గృహాలు ఈ పథకం కింద మంజూరయ్యాయన్నారు. ఒక్కొక్క గృహానికి రూ.1 లక్ష 80 వేలు ఇస్తున్నట్లు, కావున లబ్ధిదారులందరూ దశల వారీగా పూర్తి చేయాలని ఆయన కోరారు. తదుపరి తహశీల్దారు లక్ష్మీనరసింహంతో కలిసి ఎంపిడిఒ లబ్ధిదారులకు గృహ హక్కు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ ఎం.వివేక్ వర్క్ఇన్‌స్పెక్టర్ శరత్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శ శాంతి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చెరువులో వృద్ధురాలి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-అల్లూరు : స్థానిక సీతమ్మ మఠం వద్దగల అల్లూరు చెరువులో మద్దిబోయిన శేషమ్మ(80) మృతదేహం బయటపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఆమె బలిజపాలెం నివాసి కాగా అదృశ్యమైందని గ్రామస్తులు తెలియజేశారు. శనివారం సాయంత్రం నుంచి కనబడటం లేదని కుటుంబ సభ్యులు వివరించారు. ఎఎస్ఐ వెంకటేశ్వర్లరావు చేరుకొని మృతికి గల కారణాలపై ఆరా తీశారు.

గుండెపోటుతో సచివాలయం కార్యదర్శి గిరీష్ మృతి

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని ఇనమడుగు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సచివాలయం2 పంచాయతీ కార్యదర్శి గిరీష్(30) గుండెపోటుతో ఆదివారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కోవూరు ఎంపిడిఒ ఎం.శ్రీహరి తోపాటు పలువురు సచివాలయ సిబ్బంది నెల్లూరులోని గిరీష్ నివాసానికి వెళ్లి ఆయనకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గిరీష్ కుటుంబం మనోధైర్యంతో ఉండాలి. గుండెపోటుతో మృతి చెందిన ఇనుమడుగు సచివాలయం2 పంచాయతీ కార్యదర్శి కుటుంబం ఇటువంటి సమయంలోనే మనం ధైర్యంగా ఉండాలన్నారు. కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునే ధైర్యాన్ని కోవూరు ఎంపిడిఒ కల్పించారు ప్రసన్న కుమార్ రెడ్డి తెలిపారు.

108 సిబ్బందిని సత్కరించిన ఎస్ఐ

ప్రజాశక్తి-ఉదయగిరి : ఆపదలో ఆపన్న హస్తం అందించే 108 వాహన సిబ్బందిని ఆదివారం ఎస్ఐ జి.అంకమ్మ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆపదలో ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను, గర్భిణులను తక్షణమే ఆసుపత్రికి చేర్చి తమ సేవలు అందిస్తున్న వారిని ఇలా సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మండలంలోని గ్రామస్తులు 108 అందిస్తున్న సేవలను ఉపయోగించుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంతో ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గ్రామాలకు చేరాలన్నారు. 108 సిబ్బంది చంద్ర, రఘు, హరి, తదితరులు పాల్గొన్నారు.

వెయింగ్ మిషన్ బహూకరణ

ప్రజాశక్తి-బిట్రగుంట : బిట్రగుంట ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు ఫైర్ ఆఫీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కోవూరుపల్లి గ్రామానికి చెందిన దారా వెంకటరమణ వెయింగ్ మిషన్‌ను ప్రయివేట్ వైద్యుడు డాక్టర్ ఆనంద్ సాగర్ చేతుల మీదుగా బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాస యాదవ్ కు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ఎ కె సుందర్ రాజ్, గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులు, గుత్తి ప్రభాకర్, సత్యం, ఖాదర్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు కల్పన ఎంపిక

ప్రజాశక్తి మర్రిపాడు : మండలంలోని పొలిరెడ్డిపల్లి పాఠశాలలో 5వ తరగతి విద్యార్థిని లింగాలపల్లి కల్పన కోచింగ్ లేకుండా నవోదయకు ఎంపికైంది. గత ఏప్రిల్ 30న నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షల్లో బాలిక అర్హత సాధించింది. వెనుకబడిన ప్రాంతాలలోని పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలు గల విద్యను అందించి కోచింగ్ లేకుండా నవోదయ విద్యాలయంలో సీటు సాధించడంతో విద్యార్థిని ప్రతిభ పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ నారాయణమ్మ అభినందించారు.

భ.ని.కా. సమావేశం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు నగరంలోని 11వ డివిజన్ భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ సమావేశాన్ని ఆదివారం ఎన్‌టిఆర్ నగర్ సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం యూనియన్ సభ్యత్వాల నమోదు కార్యక్రమం అలాగే కార్మికుల సంబంధించిన సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షులు అవుల.పెంచలయ్య, నగర కమిటీ సభ్యులు పసుపులేటి.మల్లికార్జున్, సిపిఎం నగర కమిటీ సభ్యులు పి.సూర్యనారాయణ, సిపిఎం డివిజన్ కార్యదర్శి టి.నారాయణ, నాయకులు బట్టేపాటి.వెంకటేశ్వర్లు, పి.రవి, నాగరాజు, పి.శ్రీనివాస్, ఐ.శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.



6వ డివిజన్ భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక 6వ డివిజన్ ఆ ఏరియా కమిటీ సమావేశాన్ని ఆదివారం శెట్టిగుంట రోడ్డు సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మికసంఘం నగర కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. అనంతరం యూనియన్ సభ్యత్వం నమోదు కార్యక్రమం, కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. భవన నిర్మాణ సంఘం నగర అధ్యక్షులు అవుల.పెంచలయ్య, ఉపాధ్యక్షులు చిరంజీవి, బలరాజ్, డివిజన్ నాయకులు వెంకయ్య, ఎ.నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా నాడు-నేడు పనులు

సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారిణి సిహెచ్ ఉషారాణి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సెకండ్ ఫేజ్‌లో ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో పనులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారిణి సిహెచ్ ఉషారాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించడమే కాకుండా అదనపు తరగతి గదులు నిర్మించి నిరుపేదలకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు పనులకు శ్రీకారం చుట్టిందని తెలిపా. పాఠశాలల కమిటీల పర్యవేక్షణలో జిల్లాలో నాడు-నేడు ఫస్ట్ ఫేజ్ పనులు పూర్తి చేశారు. సెంకడ్ ఫేస్‌లో జిల్లాలో ఎన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నారో ఆమె మాటల్లోనే..

ప్రశ్న. నాడు నేడు మొదటి ఫేజ్‌లో ఏయే పాఠశాలలో ఏయే పనులు చేశారు..?

జవాబు. నాడు-నేడు మొదటి ఫేజ్ అభివృద్ధి పనుల్లో 945 పాఠశాలల్లో టాయిలెట్స్ నిర్మాణం చేశాం. అదే విధంగా 1053 పాఠశాలల్లో మరమ్మతులు చేశాం. 1048 పాఠశాలలకు విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు వంటి మౌలిక వసతులు కల్పించాం. 1041 పాఠశాలల్లో ఆర్ఒ సిస్టమ్ ఏర్పాటు చేసి పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాం. బోర్లు వేయించడం వంటివి చేశాం. 911 పాఠశాలలకు విద్యార్థులు తరగతి గదుల్లో కూర్చొని చదువుకొనేందుకు అనుకూలంగా డస్కులు పంపిణీ చేశాం. 1055 పాఠశాలల్లో గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేశాం. 1029 పాఠశాలలకు పెయింటింగ్ వేయించి అందమైన, అహ్లాదభరితమైన వాతావరణం సృష్టించాం. 812 పాఠశాలల్లో స్మార్టు టీవీలు ఏర్పాటు చేసి ఇంగ్లీషు ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చాం. 44 పాఠశాలలకు కాంపౌండ్ వాల్స్ నిర్మించాం.

ప్రశ్న. ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనుల నిర్వహణకు నాడు-నేడు పథకంలో మొదటి విడతలో ఎన్ని పాఠశాలల్లో పనులు నిర్వహించారు. ఎంత మేరకు నిధులు ఖర్చు చేశారు..?

జవాబు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాడు-నేడు పనులు మొదటి విడత పనులు విజయవంతంగా పూర్తి చేశాం. జిల్లాలో 655 ప్రైమరీ స్కూల్స్, 148 అపర్ ప్రైమరీ స్కూల్స్, 261 హైస్కూల్స్‌లో పనులు నిర్వహించాం. ఈ పనులు కింద పాఠశాలల్లో టాయిలెట్స్ నిర్మాణం, ప్రహరీ నిర్మాణం, అదనపు తరగతి గదుల నిర్మాణం వంటి వాటితోపాటు ఆర్ఒ సిస్టమ్, విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్, గ్రీనరీ బోర్డులు ఏర్పాటు చేశాం. ఈ పనులు చేసేందుకు రూ.206 కోట్ల 84 లక్షల20 వేలు ఎస్టిమేషన్‌గా నిర్ణయించగా రూ.198 కోట్లు 98 లక్షల, 64 వేలు ఖర్చు చేశాం.

ప్రశ్న. నాడు-నేడు సెకండ్ ఫేజ్ కింద ఎన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారు.. ఎస్టిమేషన్లు ఎంత వేశారు. ప్రభుత్వం అడ్వాన్స్‌గా ఎంత నిధులు విడుదల చేసింది..?

జవాబు. నాడు-నేడు సెకండ్ ఫేజ్ కింద జిల్లా వ్యాప్తంగా 1112 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేసేందుకు నిర్ణయం తీసుకున్నాం. వేసవి సెలవులు పూర్తి అయ్యేలోగా ఈ పనులు పూర్తి చేసి రానున్న విద్యాసంవత్సరానికి పాఠశాలలను అందంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఈ సెకండ్ ఫేజ్‌లో 726 ప్రైమరీ పాఠశాలల్లో, 173 అప్పర్ ప్రమరీ పాఠశాలల్లో, 164 పాఠశాలల్లో 1244 అధనపు తరగతి గదులు నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. ఈ పనులు పూర్తి చేసేందుకు రూ.326 కోట్లు 3 లక్షలు ఖర్చు చేసేందుకు ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. అడ్వాన్స్‌గా 52 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వం రూ.8 కోట్ల 63 లక్షల 79 వేలు నిధులు విడుదల చేసింది.

ప్రశ్న. జిల్లాలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు పరిధిలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు ఉన్నాయి.. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు. అధికారులు ఎంపిక చేసిన విద్యార్థులందరూ పాఠశాలలకు వస్తున్నారా..?

జవాబు. జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు పది అందుబాటులో ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కొక్క పాఠశాలలో 6వ తరగతిలో 40 మంది విద్యార్థుల ప్రవేశానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. 7,8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తును ఆహ్వానించాం. దరఖాస్తు చేసుకున్న పేద ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బిపిఎల్ బాలికల్లో అర్హులైన వారితో సీట్ల భర్తీ దాదాపుగా పూర్తి చేశాం. ఎస్ఆర్ పురంలో 5వ తరగతికి, 8వ తరగతికి సంబంధించిన రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయి. తడలో 8వ తరగతి విద్యార్థులు సీట్ల భర్తీ అయినప్పటికీ ఎక్కువ రోజుల నుంచి పాఠశాలకు రాకుండా ఇద్దరు విద్యార్థులున్నారు. ఈ విద్యార్థులు ఎందుకు తరగతులకు హాజరు కాలేదో విచారణ చేస్తున్నాం.

కార్మికులు ఐక్యంగా పోరాడాలి

ప్రజాశక్తి-వింజమూరు

కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు ఐక్యంగా పోరాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక పంచాయతీ ప్రాంగణంలో ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో జెండాను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలో మండల మహాసభను ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాల గురించి ప్రజలకు తెలియబరిచారు. పని భద్రతా ఉందా లేదని ఆశాలను అడగగా వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆశాలు కానీ స్వీపర్స్ గానీ మధ్యాహ్నం భోజనం నిర్వహిస్తున్న నిర్వాహకులు గానీ పారిశుధ్య కార్మికులకు జీతాలు కనీసం రూ.10వేలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం వల్ల ప్రజలకు పెనుముప్పు పొంచి ఉందని తెలియజేశారు. ఆశాలకు కనీస జీతం రూ.26 వేలు ఇవ్వాలని వారాంతం సెలవులు ఇవ్వాలని మేటర్నిటీ లీవులు పిఎఫ్ వర్తించలా ప్రభుత్వం చూడాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కులమత విద్వేషాలను రెచ్చగొట్టడం తప్ప సమాజానికి పనికొచ్చే పనులు చేయడం లేదన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాడి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని ఆయన సూచించారు. ఆయనవెంట సిపిఎం మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మండల నాయకులు తిరుమలయ్య, తిరుపాలు, బయన్న, సిఐటియు నాయకులు కామాక్షయ్య, చెంచులు బాబు, ఆశాలు అరుణ, నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతునన ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఎన్నికల హామీని మరచిన బిజెపి

ప్రజాశక్తి-వింజమూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయకుండా మదిగలను మోసం చేసందని ఎంఆర్‌పిఎస్ నాయకులు పేర్కొన్నారు. ఎస్‌సి వర్గీకరణ సాధన కోసం ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ ఆదేశాలమేరకు ఆదివారం స్థానిక ఆర్ అండ్ బి బంగ్లాలో విలేఖరులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు పందిటి అంబేద్కర్ మాదిగ మల్లెల తిరుమలేశ మాదిగ పాల్గొని వారు మాట్లాడారు. 24వ తేదీన నెల్లూరు టౌన్‌లో జరిగే ఎంఆర్‌పిఎస్, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల పాల్గొని విజయంతం చేయాలన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ, రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరు అవుతారని తెలిపారు. అదేవిధంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి నేడు రెండో సారి అధికారంలోకి వచ్చిన చేయకుండా మాదిగలను నమ్మించి మోసం చేసిందన్నారు. నమ్మిన మాదిగలపై చిత్తశుద్ధి లేకుండా ఉన్న కేంద్రం ప్రభుత్వంపై మాదిగలు మరో పోరాటానికి సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోచిపాతల ఆనంద్ మాదిగ, వర్ల తిరుమలేశు, గంగపట్ల వెంగళరావు మాదిగ, చెంచల రాకేష్, గంగపట్ల నాగరాజు, రుద్రాక్ష సాయినాథ్, గంగపట్ల రవీంద్ర, జి.మాలకొండయ్య, సిహెచ్ ధనరాజ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

ప్రజాశక్తి-అల్లూరు : మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలని రామిశెట్టి వెంకట సుబ్బారావు ట్రస్ట్ చైర్మన్ వెల్లడించారు. ఆదివారం మండల కేంద్రం స్థానిక అల్లూరుపేటలో బ్యూటిషన్ కోర్సులో శిక్షణ పొందిన సుమారు 30 మంది మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్, బ్యూటిషన్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో నారాయణ హాస్పిటల్ సిఇఒ దారా రామారావు, మెతుకు రాజేశ్వరి, టంగుటూరి త్రివేణి, తదితరులున్నారు.

అల్లూరులో గడపగడపకు మన ప్రభుత్వం

గడప గడప కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ రామిరెడ్డి

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని రాయపేట, ఆదినారాయణ పురం గ్రామాలలో ఆదివారం కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి గడప గడప కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన గ్రామానికి చేరుకోవడంతో అభిమానులు భారీ ఎత్తున బాణాసంచ పేల్చి భాజా భజంత్రీలతో మంగళ హారతులు ఇచ్చి పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పనితీరుపై ప్రజలను అడగ్గా ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు వాలంటీర్ల వ్యవస్థ ద్వారా 1వ తేదీన పెన్షన్ ఇంటికి చేరుతుందని తెలియజేశారు. ఇళ్లు లేని వారికి స్థలాలు ఏర్పాటు చేసి అందులో ఇంటి నిర్మాణాలు చేపడుతున్న క్రమంలో ప్రతి పేదవాడికల సాకారమవుతుందని హర్షం వ్యక్తం చేశారు. దాదాపు ఒక్కొక్క కుటుంబంలో రూ.18 లక్షల మేరకు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుంటు న్నారని సంతృప్తిని వ్యక్తం చేశారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులందరూ నార్లు పోసుకొని నాట్లుకు సిద్ధంగా ఉన్న తరుణంలో 25వ తేదీ వరకు నాట్లు వేయవద్దని రైతులకు సూచించారు. వరద ప్రవాహం వల్ల చాలా నష్టం ఏర్పడుతుందని సంబంధిత విషయంపై ఇప్పటికే కలెక్టర్‌తో సంప్రదించామని వ్యాఖ్యానించారు. అధిక వరద కారణంగా పంటలు మునిగిపోయే అవకాశం ఉందని అలా జరిగితే రైతులు భారీగా నష్టపోతారన్నారు. తుఫాను ప్రభావానికి తీర ప్రాంత ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. అధికారులు ప్రజలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆయా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఎఫ్‌డిఆర్ నిధుల ద్వారా అధికారులు గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టాలని విన్నవించారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కావలి ఎఎంసి చైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డి, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి సామంతుల సురేష్ రెడ్డి, నాయకులు కోడూరు సాధక్ కుమార్ రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, దాసరి పోలయ్య, కరేటి దైవదానం, డిప్యూటీ తహశీల్దార్ చెంచయ్య, అల్లూరు నగర పంచాయతీ మేనేజర్ ఫణికుమార్, ఎంఇఒ నాగేశ్వరరావు తదితరులున్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామిరెడ్డి

ప్రజాశక్తి-కావలి

విద్యార్థు లు కేవలం విద్యలోనే కాకుండా క్రీడల్లో కూడా బాగా రాణించి, పాఠశాల కు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం జరుగుతున్న జగనన్న క్రీడా సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రీడా సంబరాలను ప్రారంభించారు. తదుపరి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ విద్యలోనే కాకుండా ప్రతి ఒక్క విద్యార్థి క్షేత్రస్థాయిలో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయిలో కూడా, క్రీడా కార్యక్రమాల్లో పాల్గొని కావలి నియోజకవర్గానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. అలాగే తల్లిదండ్రులకు కూడా మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు తగు సూచనలు తెలియజేశారు. అనంతరం కబడ్డీ, క్రికెట్, గేమ్స్‌లో పాల్గొని బ్యాటింగ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కనమర్లపూడి వెంకట నారాయణ, జనిగర్ల మహేంద్ర యాదవ్, కుందుర్తి శ్రీనివాసులు, కామయ్య, జంపా రాఘవులు, దామిశెట్టి సుధీర్ నాయుడు, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

ప్రజాశక్తి-కొండాపురం

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యమని ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తూర్పు ఎరపల్లిలోని ఎస్‌సి, బిసి కాలనీలు, మనంవారి పల్లి, కొట్టేవారిపల్లి ప్రాంతాలలో గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైసిపి ఉదయగిరి నియోజకవం గం ప్రచార కార్యదర్శి శాంతమ్మతో కలిసి గడపగడపకు తిరిగి ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేదలకు అండగా నిలిచి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎన్ని అవాంతరాలు ఎదురైనా వాటిని అధిగమించి నెరవేర్చుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ఆయన పరిపాలనలో ఎస్‌సి ఎస్‌టి బిసి మైనారిటీలకు లబ్ధి చేకూరిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన వ్యక్తులకే లబ్ధి చేకూరిందని, వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అన్ని కుటుంబాలకు అందించిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో తాను ఎంఎల్ఎగా ఉన్న సమయంలో తూర్పు ఎర్రబెల్లి ప్రాంతంలో దళితులకు 250 ఎకరాల భూమిని రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంపిణీ చేశామని తెలిపారు. ఆ ప్రభుత్వ హయాంలోనే సిసి రోడ్లు ఆర్అండ్‌బి రోడ్లు వేయించి ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి పథంలో నడిపినమని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిపి బొడ్డు అనురాధ, అన్ని శాఖల అధికారులతో పాటు మండల కన్వీనర్ చిమ్ముల రాజేంద్రప్రసాద్, బొడ్డు మాధవరెడ్డి, స్థానిక సర్పంచ్ ఏసన్న, ఎంపిటిసి దారా హైమావతి, వైసిపి నాయకులు బి చంద్ర, బొట్ట మాల్యాద్రి, బి చిన్నకొండయ్య, పిన్నికి కొండయ్య పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి చేయాలి

మాట్లాడుతున్న చేజర్ల వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-మర్రిపాడు

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణంలో మండల నాయకులు ఆరికట్ల జనార్ధన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయనతోపాటు నియోజకవర్గ పరిశీలకుల బుల్లెట్ భాస్కర్ పాల్గొని పార్టీ శ్రేణులకు పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి లేకపోవడంతో పార్టీ నేతలతో సమన్వయ సమావేశాలు నిర్వహించలేక, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టలేక పోయామన్నారు. ఇప్పటికే ఎఎస్‌పేట, ఆత్మకూరు, అనంతసాగరం, మర్రిపాడు మండలాల నేతలతో సమావేశాలు నిర్వహించామన్నారు. అలాగే పార్టీని బలోపేతం చేసే విధంగా బూతు కమిటీ, డివిజన్ ఇన్‌ఛార్జి నియమించి వారితో సమావేశం నిర్వహించామని తెలిపారు. నాయకులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలియజేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిని నియమించాలని రాష్ట్ర పార్టీ అధిష్టానానికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, మాజీ ఎంపిపి బంకా వెంకటసుబ్బారెడ్డి, ఎస్‌సిసెల్ నాయకులు పాలెం పోలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : వరల్డ్ రిమెంబర్స్ డే సందర్భంగా జిల్లా ఎస్‌పి సిహెచ్ విజయరావు ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ షేక్.సుభాని రోడ్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులను కాపాడినందుకు వారికి సేవలు అందించినందుకు గానూ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న కె.లత, అంబులెన్స్ డ్రైవర్ ఎం.లక్ష్మయ్య, హెడ్ కానిస్టేబుల్ టి.రమేష్‌లను అభినందిస్తూ ప్రోత్సాహక బహుమతులను ఎస్ఐ అందజేశారు. గతంలో రోడ్డు యాక్సిడెంట్ కేస్‌లో చనిపోయిన మేక మధుబాబు అమ్మ మేక.పోలమ్మని పిలిపించి ఆమెకు భరోసానిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. ఎక్కడైనా ప్రమాదకరమైన సంఘటనలు యాక్సిడెంట్లు జరిగితే వెంటనే మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లి సహాయం అందించాలని, అలాంటివారిపై ఎలాంటి కేసులు విచారణ ఉండవని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

వైసిపి ప్రభుత్వంతో ప్రజలకు ఇక్కట్లు..

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టిడిపి కోవూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నరసాపురం, కొరుటూరు గ్రామలలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజలు ఆయనతో వాళ్ల సమస్యలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనతో ప్రజలు విసిగిపోయారని, రాబోవు ఎన్నికల్లో ప్రజలు వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పి తెలుగుదేశం పార్టీకి బ్రహ్మరథం పడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. రాష్ట్రంలోని యువత, మహిళలు, ఉద్యోగస్తులు అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో తమ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ప్రస్తుత ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమన్నారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రావెళ్ల వీరేంద్ర చౌదరి, కార్యనిర్వాహక కార్యదర్శి చెంచు కిషోర్ యాదవ్, అధికార ప్రతినిధి చెవుకుల కృష్ణచైతన్య, కొండూరు సుధాకర్‌రెడ్డి, బట్టేపాటి సురేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



భోజనం పరిశీలిస్తున్న శ్రీదేవి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.శ్రీదేవి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బిసి బాలుర కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను నిర్వహించాలన్నారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని వసతులను, భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. వసతి గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చూసుకోవాలి సిబ్బందికి సూచించారు. వార్డెన్ శ్రీనివాసరావు, హాస్టల్ సిబ్బంది ఉన్నారు.

శిథిలావస్థలో అంబేద్కర్ భవనం

శిథిలావస్థకు చేరిన అంబేద్కర్ భవనం

భవనంలోనే చెట్టు ఉన్న దృశ్యం

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని గండిపాలెం రోడ్డువైపు ఇందిరానగర్ కాలనీ వద్ద ఉన్న అంబేద్కర్ భవనం శిథిలావస్థకు చేరింది. ఈ భవనం ఎప్పుడెప్పుడు పడిపోతుందో అని స్థానికులు భయపడుతున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడు అని, ప్రతియేటా ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను స్మరించుకోవడం తప్ప శిథిలావస్థలో ఉన్న భవన నిర్మాణం పట్టించుకున్న నాథుడు కరువయ్యారని పలువురు పెదవిరుస్తు న్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలో లేని అంబేద్కర్ భవనాన్ని ఉదయగిరి గండిపాలెం రోడ్డు వైపు ఇందిరానగర్ కాలనీ వద్ద 1986లో ఈ భవనాన్ని నిర్మించారని తెలిపారు. ఈ భవనానికి ఎందరో నాయకులు ప్రజా సంఘాలు వేదికలుగా వాడుకొంటూ మహనీయుని స్మరించుకుంటూ మాటలు చెప్పడం వారి కార్యక్రమాలు ముగించుకుని వెళ్లడం తప్ప నిర్మాణం పట్టించుకున్న దాఖలాలు ఇంతవరకు కనపడలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజా సంఘాలు కూలేందు కు సిద్ధంగా ఉన్న భవన నిర్మాణం చేపట్టి భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు అరుదైన గౌరవాన్ని కల్పిస్తూ వారి ఆశయ సాధనకు వేదికగా నిర్మించిన భవనం స్థానంలో నూతన నిర్మాణం చేపట్టాలని ఎంఆర్‌పిఎస్, పలువురు ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు కోరుతున్నారు.